## నేడు సీతారామపై మంత్రుల సమీక్ష






# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 13 | జూన్ | 2024

పేజీలు 8


# అత్యద్భుత అభివృద్ధి ఖమ్మమే మా లక్ష్యం




## సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

-విద్యపై ప్రత్యేక దృష్టి..

పాఠశాలలకు పక్కా భవనాలు

-జిల్లా సమీక్షా సమావేశంలో

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

-పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అత్యద్భుతంగా అభివృద్ధి చెందిన ఖమ్మంజిల్లాయే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఖమ్మంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అభివృద్ధి, వివిధ శాఖల ప్రగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి రఘురాం రెడ్డి, కలెక్టర్ గౌతమ్ తో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ప్రపంచంతో పోటీపడేవిధంగా ఖమ్మంజిల్లాను అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి అధికార యంత్రాంగం అనుగుణంగా పనిచేయాలన్నారు. ఉద్యోగులు పారదర్శకంగా, జవాబుదారిగా వ్యవహరించాలన్నారు. వ్యవసాయ అధారితమైన ఖమ్మంజిల్లాలో వ్యవసాయ రంగానికి కావాల్సిన అన్ని వనరులను కల్పించే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం తీసుకుందని కొద్ది కాలంలో పరి పూర్తి చేస్తుందన్నారు. ముఖ్యంగా సాగునీటి వనరులు ప్రస్తుత పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల పరిస్థితి, సీతారామ, ఇతర మధ్య, చిన్నతరహా ప్రాజెక్టుల వివరాలు, ఆయకట్టు పరిస్థితి

మిగతా 2లో..

## ఆశలన్నీ ఐదు పంచాయతీలపైనే..



- బిజేపి నాయకుల హామీ నెరవేరేనా
- గురుశిష్యుల మధ్య సయోధ్య కుదిరేనా

**ప్రజాపక్షం/భద్రాచలం :** పోలవరం పేరుతో ఏడు మండలాలు ఆంధ్రాలో విలీనమైయ్యాయి. కాగా రాష్ట్ర విభజన తర్వాత విలీనంలో భద్రాచలం పూర్వ మండలం మొత్తం కలిసిపోగా, కేవలం భద్రాచలం పట్టణం మాత్రమే తెలంగాణలో మిగిలింది. కనీసం అభివృద్ధి చేసుకునేందుకు జానెడు జాగ లేకపోవడంతో ఏపిలో విలీనమైన భద్రాచలం పూర్వ మండలంలో గల ఐదు పంచాయితీలైన ఎటపాక, పిచుకలపాడు,కన్నాయిగూడెం,పురుషోత్తపట్నం, నెల్లిపాక పంచాయితీలు భద్రాచలానికి ఇస్తే తప్ప ఇక్కడ అభివృద్ధి జరగదని పెద్ద ఎత్తున సిపిఐ ఆధ్వర్యంలో గత రెండేళ్ల క్రితం భారీ ఎత్తున ఉధ్యమం జరగగా, ఈ ఉధ్యమానికి అనూహ్య స్పందన కూడా లభించింది. భద్రాచలం ఆభివృద్ధి జరగాలంటే ఆ ఐదు పంచాయితీలు కలవాలని, వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఆ పంచాయితీల్లో ఉందని,

మిగతా 2లో..

## కరెంటు ఉంటుందా..? ఉచిత ప్రయాణం ఎలా ఉంది..?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కరెంటు ఉంటుందా... ఏమైనా కోతలు ఉన్నాయా...? ఏ సమయంలో విద్యుత్ పోతుంది. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది. దీని వల్ల లాభం జరుగుతుందా. అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మహిళా ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఆయన ఖమ్మం పాత బస్టాండ్ నుంచి చింతకాని మండలం జగన్నాథపురం వరకు పల్లెవెలుగు

ఆర్టీసి బస్సులో ప్రయాణికులతో ఉప ముఖ్యమంత్రి ముచ్చట

ఆర్డినరి బస్సులో భట్టి ప్రయాణం

బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రయాణికులను ఆయన ప్రభుత్వ తీరు, అందుతున్న

మిగతా 2లో..

# అత్యద్భుత అభివృద్ధి ఖమ్మమే మా లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)**

అడిగి తెలుసుకున్న విక్రమార్క సాగునీటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసుకోవడానికి ఒక ప్రత్యేక క్యాలెండర్‌ను రూపొందించుకుని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. కొన్ని చిన్నతరహా ప్రాజెక్టులకు సంబంధించి పనులు జరగడం లేదని పండ్రేగుపల్లి ప్రాజెక్టు పనులు సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టుకుని సాగు భూములకు అందించాలన్నారు. నీటి పారుదల శాఖాధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని విద్యా అవసరాలకు నిధుల కొరత లేకుండా చూస్తుందన్నారు. పాఠశాల ప్రారంభమైన రోజే పుస్తకాలు, యూనిఫాం లు అందించి ఈ ప్రభుత్వం విద్య పట్ల గల అంకిత భావాన్ని చూపిందన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఈ దేశంలోనే ఒక మోడల్‌గా నిర్మాణం చేయనున్నామన్నారు. ఈ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి భూములను గుర్తించాలని, ఏడాదిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ ఉపకార వేతనాల సంఖ్యను మరో 100 పెంచుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రతి గుత్తేదారు పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యకు ఎన్ని నిధులైన ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరుకు సంబంధించి రూ. 20 కోట్ల బడ్జెట్‌తో 18వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చునని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టుల మరమ్మతులు పూర్తి చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపుదల చేసి చివరి ఆయకట్టుకు నీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అభివృద్ధి చేయాలని, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వపాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సత్తుపల్లి, వైరా శాసన సభ్యులు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, అధికారులు కృష్ణ భాస్కర్, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, నీటిపారుదల శాఖాధికారులు, విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సీతారామపై మంత్రుల సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సీతారామ ప్రాజెక్టును గురువారం నలుగురు మంత్రులు పరిశీలించనున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఉదయం 11 గంటలకు అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద సీతారామ ప్రాజెక్టును సందర్శిస్తారు. ప్రాజెక్టు పనులు గోదావరి, ఇతరత్రా పనుల పురోగతిని సందర్శిస్తారు. సమీపంలోని రెగ్యులేటర్‌ను, బిజి కొత్తూరు వద్ద గల పంపుహౌజ్‌ను సందర్శిస్తారు. పంపు హౌజ్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇస్తారు. ముల్కలపల్లి మండలం పుసుగూడెం వద్ద రెండవ పంపు హౌజ్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.30కు సీతారామ ప్రాజెక్టు పవర్ పాయింట్ సందర్శనలో పాల్గొంటారు. నాలుగు గంటలకు ఏన్కూరుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకుని లింక్ కెనాల్ పనులను పరిశీలిస్తారు. అక్కడి నుంచి మంత్రులు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

# విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వైరా మున్సిపాలిటీ చైర్మన్ జైపాల్ విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజు ప్రభుత్వం దుస్తులు, పుస్తకాలు అందజేయడం ఇదే తొలిసారి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, పలువురు ఉపాధ్యాయులు, మాజీ రైతు బందు మండల అధ్యక్షులు మిట్టపల్లి నాగి పాల్గొన్నారు.

# కరెంటు ఉంటుందా..?
# ఉచిత ప్రయాణం ఎలా ఉంది..?



**(మొదటిపేజీ తరువాయి)**

పథకాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం తదితర విషయాలపై మహిళా ప్రయాణికుల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగులవంచ గ్రామానికి చెందిన జానమ్మ తో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల వచ్చే లాభమేమిటని అడిగారు. దీనికి ఆమె స్పందిస్తూ గతంలో ఛార్జీలు భరించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడేవారిమని ఇప్పుడు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయడం వల్ల ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. కండక్టర్ శైలజను ఉచిత బస్సు టికెట్లు మొత్తం ప్రయాణికులు తీరు ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సులు వాడుకుంటున్న మహిళలు చాలా సంతోషంగా ఉన్నారని బస్సులకు ఇబ్బందులు లేకుండా మరో 300లకు పైగా బస్సులను కొనుగోలు చేశామన్నారు. ఆర్టిసి విస్తరణకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా దోహదపడుతుందన్నారు. ఉచిత ప్రయాణం కారణంగా ప్రయాణికులు పెరిగారని అందుకే బస్సుల రద్దీ పెరుగుతుందని దీనిని అధిగమిస్తామన్నారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి బస్సులను కొనుగోలు చేయించి ఆర్టిసిలో వినియోగించుకునేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పాతర్లపాడుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలుకు ప్రయత్నించామని ఇప్పటికే కొన్ని పూర్తి చేశామన్నారు. మరి కొన్నింటిని అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, ఆర్టిసి రీజినల్ మేనేజర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి బొర్రా ఉన్నతికి ఆశీర్వాదం



**ప్రజాపక్షం/వైరా:** సీనియర్ రాజకీయ నాయకులు బొర్రా వెంకటేశ్వర్లు(లేటు), బొర్రా పద్మావతి దంపతుల కుమారు డు, కోడలు బొర్రా సుధాకర్, రాధిక దంపతుల కూతురు బొర్రా ఉన్నతి ఓణీల వేడుక కార్యక్రమం బుధవారం వైరాలో కమ్మవారి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, నేకరకల్లు ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పోట్ల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, ఉమా దంపతులు, మున్సిపాలిటీ చైర్మన్ జైపాల్, స్వప్న దంపతులు, బొంతు రాంబాబు, వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి నాగి, ఫణితి సైదులు, ఉష దంపతులు, దార్న రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, భూమాత క్రిష్ణమూర్తి, మరికంటి శివ, డేడికుమారి దంపతులు, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, నంద్రు నాగరాజు, కర్నాటి హనుమంతరావు, చల్లా సతీష్, జవ్వాజి నాగరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు తదితరులు చిన్నారి బొర్రా ఉన్నతిని ఆశీర్వదించారు.

# ఆశలన్నీ ఐదు పంచాయతీలపైనే..

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రభుత్వాలు చొరచూపి భద్రాచలానికి న్యాయం చేయాలని నాయకులు, మేధావులు డిమాండ్ చేశారు. నిజానికి ఆ ఐదు పంచాయితీలు భద్రాచలం మండలంలో కలిస్తే తప్ప అభివృద్ధి జరిగే పరిస్థితి లేదు. రామాలయానికి సంబంధించిన సమారు 920 ఎకరాల భూమి ఏపిలో కలిసి పురుషోత్తపట్నం పంచాయితీలో ఉంది. ఇక పిచుకలపాడు, కన్నాయిగూడెం, ఎటపాక పంచాయితీల్లో సైతం ప్రభుత్వ భూమి పెద్ద ఎత్తున ఉంది. ఏపిలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఇక్కడి ప్రజల ఆశలన్నీ ఆ ఐదు పంచాయితీలపై పడింది. అవి ఇటు వస్తే భద్రాచలానికి తిరిగి పూర్వ వైభవం వస్తుందని ఇక్కడి ప్రజల ఆశ.

**బిజేపి నాయకుల హామీ నెరవేరేనా...**

ముగిసిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇక్కడికి ప్రచారానికి వచ్చిన బిజేపి నాయకులు ఆ ఐదు పంచాయితీలు తెలంగాణలోనికి వచ్చే విధంగా కృషి చేస్తామని, బిజేపి సర్కార్ తిరిగి అధికారంలోనికి రాగానే ప్రధానమ ంత్రి మోడిని కలిసి విషయాన్ని పూర్తిగా వివరిస్తామని హామీ ఇచ్చారు. వారు కోరుకున్నట్లుగానే కేంద్రంలో బిజేపి అధికారంలోనికి రావడంతో బిజేపి నాయకుల హామీ నెరవేరుతుందా లేదా అనే వాదన మొదలైంది. కేంద్రం దీనికి ఒప్పుకుంటే మరో ఆర్డినెన్స్ ద్వారా భద్రాచలంలోకి ఐదు పంచాయితీలు ఇచ్చే అవకాశం ఉంది.

**గురు శిష్యుల మధ్య సయోధ్య కుదిరేనా...**

ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భద్రాచలంలోకి ఏపిలో విలీనమైన ఆ ఐదు పంచాయితీలు కలవాలంటే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులైన రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య సయోధ్య కుదరాలి, ఈ గురుశిష్యులు ఇద్దరు ఓ తాటిపైకి వస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. రెండు రాష్ట్రాలు ఒప్పంద పత్రాలను కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇరు ముఖ్యమంత్రులు విన్నపాన్ని స్వాగతించి ఆర్డినెన్స్ ద్వారా సమస్య పరిష్కరించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పలు సందర్భాల్లో చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాల్లో భద్రాచలం కూడా మాదే అన్నారు. ఆ వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. భద్రాచలాన్ని ఏపిలో కలుపుకుంటామని కేంద్రంలో బలమైన శక్తిగా మారిన సిఎం చంద్రబాబు పట్టుబడితే పరిస్థితి ఏంటీ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భౌగోళిక పరిస్థితులు ఆంధారంగా రాష్ట్ర విభజన సమయంలో ఆఖరి నిమిషంలో భద్రాచలాన్ని కలిపిన విషయం తెలిసిందే.

# ముగిసిన వేసవి శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/వైరా:** వేసవి ఉచిత కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం భద్రాద్రి మాస్టర్ ఆర్ అండ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జి.రఘు, కరాటే మాస్టర్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు కాంగ్రెస్ నాయకులు, ఫణితి సైదులు, టీచర్ రాంబాబు, తెలంగాణ సీనియర్ కరాటే మాస్టర్ శేఖర్ పాల్గొని కరాటే నేర్చుకునే విద్యార్థులకు సర్టిఫికెట్లు, వారికి బహుమతులు అందజేయడం జరిగింది. కరాటే నేర్చుకున్న బాలబాలికలకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కరాటే మాస్టర్ రఘు ఇలాగే అభినందించారు.

# పుస్తకాలు, దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 1వ వార్డు ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు యూనిఫామ్‌లను కౌన్సిలర్ మరికంటి డేడికుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వారు విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ విద్యార్థులుగా పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరిలాల్, టీచర్ సుశీల, ఆర్పి జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, పవన్, నర్సింహారావు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు అత్యంత ప్రాధాన్యత




**-బడ్జెట్‌లో నిధుల కేటాయింపు**
**-నేటి బాలలే రేపటి పౌరులు**
**-పాఠశాలల పునః ప్రారంభోత్సవంలో**
**ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణం కోసం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ఎన్ఎస్ కెనాల్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల పునః ప్రారంభ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో ఎన్ని నిధులైన కేటాయిస్తామని ఆయన తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని బాలల బంగారు భవిష్యత్తుపై రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంటే నిర్లక్ష్య ధోరణి ఉండేదని ఆ ధోరణి నుండి ఇష్టమని భావన ప్రజల్లో కలిగేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి విద్యార్థికి కావాల్సిన తరగతి గది, తాగునీరు, మరుగుదొడ్ల నీటి సౌకర్యంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సరైన సమయంలో అందిస్తే మంచి ఫలితం ఉంటుందని పాఠశాల తెరిచిన రోజునే అందేలా కార్యాచరణ చేశామన్నారు. ఇంగ్లీష్ మీడియంను బాగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యావ్యాప్తిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాఠశాలలపై ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తామన్నారు. అప్పటి యుపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో తీసుకు వచ్చిన విద్యాహక్కు చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

**విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి : మంత్రి తుమ్మల**



విద్యా, వైద్యం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. విద్యపై ఎంత ఖర్చు పెట్టేందుకైనా ప్రభుత్వం వెనకాడదని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన చేస్తుందన్నారు. రూ. 2వేల కోట్ల నిధులతో పాఠశాలలకు వసతుల కల్పన చేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామన్నారు. పేద పిల్లలే అగ్రస్థానంలో ఉండేలా విద్యాశాఖకు సంబంధించి ఎక్కడ లోటు లేకుండా చేస్తామన్నారు. మెగా డియస్సి ద్వారా సుమారు 10వేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆలోచన విధానాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల్లో ఆధునిక విద్య, ఆధునిక వైద్యం అందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల తెలిపారు. జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం నాడే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించడం చాలా హర్షించదగిన పరిణామమన్నారు. విద్యార్థుల యూనిఫాం మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేయించామన్నారు. కటింగ్, కాజా, బటన్ మిషన్ల పట్ల మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు కలెక్టర్ తెలిపారు. యూనిఫాం మంచి నాణ్యతతో ఉన్నాయని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధన చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ చింతకాని :** నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సినీ నటుడు బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఎన్‌బికె ఫ్యాన్స్ అసోసియేషన్ తిరుమలపురం యూత్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ సీతారత్నం, యూత్ సభ్యులు చావల మడుగు వీరబాబు, గోగుల నర్సింహారావు, రావట్ల ఉపేంద్రచారి, గోద ప్రసాద్, ఐతం తిరపయ్య, మదుపల్లి పెంటయ్య, చావలమడుగు శ్రీను, ఐతం కిషోర్, బెల్లంకొండ కళ్యాణ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామపంచాయతీపరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థిణి, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత పాఠ్యపుస్తకాలు, యునిఫామ్స్, నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ చింతమల్ల పద్మావతి, ఏపిపిసి ఛైర్మన్ వప్పుల విజయ ముఖ్య అతిథులుగా హాజరయ్యి అందజేసి మాట్లాడారు..విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానానికి రావాలని, గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చింతమల్ల రవి, మండలపరిషత్ కో ఆప్షన్ సభ్యులు దావూద్, పాఠశాల ఉపాధ్యాయులు కమల, సీత, సతీష్, అశోక్, మల్లయ్య, గణేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం




**ప్రజాపక్షం/ మధిర :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని హ్యూమన్ రైట్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట వెంకటే అన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు బడికి వెళ్లి ఆటపాటలతో, విద్య, ఆరోగ్యం పొందే హక్కు ఉందని తెలిపారు. తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మారిన పిల్లలు పేదరికం, నిరక్షరాస్యత తదితర కారణాల వల్ల మరికొంతమంది పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారన్నారు. బాల కార్మిక సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని, బాల కార్మిక నిర్మూలనకు కఠిన చర్యలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ కన్నెపోగు వెంకటేశ్వర్లు, పిఎల్‌వి నిస్సిహారిణి పాల్గొన్నారు.

# రహదారి పనులు నాణ్యతతో చేపట్టండి



**-అవసరమైన ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలు ఏర్పాటు చేయండి**
**-ఎన్‌హెచ్ఏఐ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రహదారి పనుల్లో వేగం పెంచి నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ అధికారులతో ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 365 బిజి), ఖమ్మం అశ్వారావుపేట రోడ్డు పనుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్లూరు నుండి మధిర రోడ్డు దగ్గర, ధంసలాపురం, బోనకల్ రోడ్డు దగ్గర, వేంసూరు నుండి సత్తుపల్లి రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా కల్లూరు నుండి మధిర రోడ్డు దగ్గర ఇప్పటికే జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ వారు అనుమతిచ్చారని ఆ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి, వేంసూరు రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లకు అనుమతి ఇవ్వాలని సూచించారు. ఈ సమస్యను సైతం త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ఖమ్మంపట్టణంలోని ప్రవేశించేందుకు ధంసలాపురం బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు, సర్వీస్ రోడ్డ గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీటన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సైట్ పరిస్థితుల ప్రకారం సర్వే చేసి సాంకేతిక నివేదిక అందజేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు వివరణ ఇచ్చారు. ఖమ్మం, అశ్వారావుపేట రోడ్డు ఎన్‌హెచ్ 365 బిబి ఏర్పడిన గుంటలను తక్షణమే పూడ్చి ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైతే సమస్యలను పరిష్కరించడానికి ఇబ్బందులు ఏర్పడతాయని వీటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** వేసవి సెలవులు ముగిసి బుధవారం పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందచేయటం జరిగింది. మండల పరిధిలోని మడుపల్లి జెడ్పిహెచ్ఎస్, నాగవరప్పాడు యుపిఎస్, నిధానపురం జిల్లా పరిషత్ హైస్కూల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కోయచలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల పునః ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, హైస్కూల్, ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు బోరిగర్ల శ్రావణి, గుంటి కవిత చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తో పాటు మధ్యాహ్న భోజనాన్ని, ఉదయం రాగిజావ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు శిరీష, రమాదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తోట వెంకటేశ్వర్లు, కటారి బ్రహ్మయ్య, మేళ్లచెరువు భద్రయ్య, తోట రవి, మాధంశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలల ను సద్వినియోగం చేసుకోవాలని కోరట్లగూడెం ఎంపీటీసీ రేగూరి వాసవి అన్నారు. మండలం లోని ఆచార్లగూడెం లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రవేట్ కు దీటుగా పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని అన్నారు. మండలం లోని సింగారెడ్డిపాలెం లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఐకేపీ ఏపీయం ఆశోక్‌రాణి, ఎంపీటీసీలు కల్పన తదితరులు పాల్గొన్నారు. మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం సందర్భంగా తొలి రోజే పాఠ్యపుస్తకాలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ప్రజాపక్షం/పినపాక: పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం పంచాయితీ పరిధిలోని గాండ్ల బయ్యారం కి చెందిన 35 సంవత్సరాలు వయసు గల వేణుగోపాలచారి తన కిడ్నీలు ఇన్ఫెక్షన్ వచ్చి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ, ఇల్లు గడవని పరిస్థితిలో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకుని స్పందించిన మణుగూరు పట్టణానికి చెందిన ''జనం కోసం మనం'' స్వచ్ఛంద సంస్థ బుధవారం ఆ కుటుంబానికి 5 వేల రూపాయలు నగదు, 50 కేజీలు బియ్యం సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు బండారు సురేష్, గుంటక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి శ్రేణుల సంబరాలు



ప్రజాపక్షం/పినపాక: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం శుభ సందర్భంగా జానంపేటలో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంతో నారా చంద్రబాబు నాయుడుకి హారతులు ఇచ్చి చంద్రబాబు పరిపాలనలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం కృషి చేయుటకు మా ఆయుష్ కూడా పోసుకొని మీరు ముందు అడుగు వేయాలని పినపాక నియోజకవర్గం తెలుగు మహిళలు హారతి పట్టారు. ఈ సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మాధవిలత, రాష్ట్ర మహిళా నాయకురాలు పసునూరి సీతమ్మ, సీనియర్ పినపాక మండల ప్రధాన కార్యదర్శి ధర్మరాజుల శంకర్, నియోజకవర్గ సీనియర్ నాయకులు పసునూరి కృష్ణ , టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం. నాగేశ్వరరావు, గ్రామ శాఖ నాయకులు శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, రమేష్, హరీష్, రాహుల్, మణుగూరు మండల నాయకురాలు పురిటి విజయలక్ష్మి , సరిత, అనసూయ, గ్రామ పెద్దలు, అభిమానులు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిరుపేద విద్యార్థినికి పుస్తకాల వితరణ



ప్రజాపక్షం/దమ్మపేట: మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన తాళ్లూరి నమితకు బుధవారం ఆదివాసీ యువ నాయకులు, సామాజిక సేవ కార్యకర్తలు అరేం ప్రశాంత్, వాడే వీరాస్వామిలు విద్యాసామాగ్రి వితరణ చేశారు. నమిత చదువుకోవడానికి స్టడీ మెటీరియల్స్, నోట్ పుస్తకాలు లేవని భానుసాగర్ కి తెలియపరచిన వెంటనే స్పందించిన వారు ఉన్నంతలో స్టడీ మెటీరియల్స్, నోట్ బుక్స్, గైడ్స్, ప్యాడ్లు, బ్యాగ్‌లు, జామెంట్రీ బాక్సులు అన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవారికి చదువు మాత్రమే ఆయుధం అని, నమిత భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయి చదువులు చదవాలని ఆకాంక్షించారు. నిరుపేద ఆర్థిక ఇబ్బందులతో చదువును నిర్లక్ష్యం చేయొద్దని, చదువుకున్న పిల్లలకి తమకున్నంతలో ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ, నవునూరి వెంకయ్య, తాళ్లూరి కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థినుల పట్ల జాగ్రత్తలు తీసుకోండి



ప్రజాపక్షం/భద్రాచలం : వసతి గృహాలపై ఆధారపడి చదివే గిరిజన విద్యార్థినీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం కూనవరం రోడ్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ తో కలిసి సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికల పాఠశాల్లో కేవలం మహిళా ఉపాధ్యాయునిలే పనిచేయాలని, బాలికల మానసిక స్థితి గతులను ఎప్పటికప్పుడు పరిశీలించి వారిలో మనోధైర్యాన్ని నింపాలన్నారు. పిల్లలకు చదువుల పట్ల ఆసక్తి కలిగే విధంగా వార్డెన్లు, హెచ్ఎంలు చొరవతీసుకోవాలని, అనంతరం పిఓ మాట్లాడుతూ తీసుకుంటున్న చర్యలపై వివరించారు. అనంతరం తరగతి గదులు, కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిడి మణెమ్మ, వార్డెన్లు పార్వతి, లక్ష్మి , హెచ్ఎం సుభద్ర తదితరులున్నారు.

## ప్రమాదకరంగా ఆర్అండ్‌బి రహదారులు..!

**- గుంటలతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు**
**- పట్టించుకోని అధికారులు**



ప్రజాపక్షం/ మధిర : నియోజకవర్గ కేంద్రమైన మధిర నుండి విజయవాడ, నందిగామ వెళ్లే ప్రధాన రహదారుల్లో గుంతల ఏర్పడి అధ్వాన్నంగా మారాయి. గడిచిన కొన్నేళ్లుగా ఈ రహదారులు మరమ్మత్తుల గురైనప్పటికీ సంబందిత అధికారులు పట్టించుకోకపోవటంతో పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మధిర మున్సిపాల్టీ పరిధిలోని మధిర దెందుకూరు, మధిర నందిగామ ప్రధాన రోడ్డు మధ్యన పలు చోట్ల గుంతలతో ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్న ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంటల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా గుంతలను పూడ్చే నాధుడే కరువయ్యారని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఈ విషయమై స్పందించి అధ్వాన్నంగా ఉన్న రహదారులకు మరమ్మత్తులు చేయించి ప్రయాణీకులు ఇటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## గ్రామాల్లో పడకేసిన ప్రత్యేక అధికారుల పాలన..!






ప్రజాపక్షం/కల్లూరు: గ్రామాల్లో ప్రజా పాలన జనవరితో ముగిసింది. తర్వాత ప్రత్యేక అధికారులతో పరిపాలన ప్రభుత్వం ప్రారంభించింది. ప్రత్యేక అధికారులు పరిపాలన ప్రారంభమైన గ్రామాలకు అడపాదడపా వెళ్లి రావడం జరుగుతుంది. గ్రామ పరిపాలన రికార్డులు సంతకాలకు మండల కార్యాలయంకు కార్యదర్శులు తీసుకుని వెళ్లి సంతకాలు పెట్టించుకుని వస్తున్నారు. ప్రస్తుతము ఉన్న పరిస్థితులలో ప్రత్యేక అధికారులకు శాఖపరమైన భారము ఉండుటవలన గ్రామాలకు వెళ్లే పరిస్థితులు లేవు ప్రస్తుతం ఇప్పుడు గ్రామాల వైపు చూడనే చూడటం లేదు నిధులు కొరత పరిపాలన భారం వలన ప్రత్యేక అధికారులు తన సొంత శాఖలకు పరిమితమై ఉన్నారు. గ్రామ పరిపాలన గాలికి వదిలేశారు. బరువు భారం కార్యదర్శిలపైనే వదిలి వెళ్లి సొంత శాఖలలోనే కూర్చుంటున్నారు. గ్రామ పంచాయతీలలో నిధుల కొరత కారణంగా ఏ పనులు చేయలేక పోతున్నారు.

**పడకేసిన పారిశుధ్యం...**

కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి, పోచవరం, కల్లూరు, చంద్రుపట్ల, బత్తులపల్లి, ముచ్చవరం, చండూరు చెన్నూరు తదితర గ్రామాలలో నిధులు కొరతతో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో దోమలు, ఈగలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైనందున చెత్తా, చెదారం, ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ పడితే అక్కడ చెత్త రోడ్లు వెంబడి దర్శనమిస్తున్నాయి. చెత్తను సేకరించి ట్రాక్టర్కు డీజిల్ నిర్వహణకు ఆర్థిక భారం కూడా కార్యదర్శులపై పడి ఇబ్బందులు పడుతున్నారు. నిధుల లేమితో గత ఆరు నెలలుగా అప్పులతో నెట్టుకొస్తున్నారు. గతంలో పంచాయతీలో చేసిన పనులకు కూడా నేటికీ నిధులు మంజూరు కాలేదు. ట్రాక్టర్ల కిస్తీలు చెత్త సేకరణకు నిర్వహణ ఖర్చులు కనీసం నిధులు లేని పాలన కార్యదర్శులకు భారమైంది. మండల పరిధిలోని హనుమ తండా, పాయపూర్, పోచవరం, తెలగవరం,వెన్నవల్లి, కిష్టయ్య బంజర పుల్లయ్య బంజర తదితర చిన్న పంచాయతీల పరిస్థితి అగమ్య గోచరంగా ఉన్నది. పాలన మరియు పారిశుధ్యం గ్రామపంచాయతీలకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల కార్యదర్శులు ఏమి చేయలేని పరిస్థితి ఉన్నది. వచ్చిన జీతం అకస్మాత్తుగా గ్రామపంచాయతీలకు వినియోగించాల్సిన పరిస్థితుల్లో వాటికి వినియోగించుకోవాల్సి వస్తుంది. వచ్చే జీతం కూడా గ్రామ పరిపాలనకే సరిపోతుంది. కార్యదర్శులకు పాలన భారమైపోయింది ప్రత్యేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు లేని పాలన ఇబ్బందులు గురవుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో వీధిలైట్లు నిర్వహణ మంచి నీటి సరఫరా అంతర్గత రహదారులు పారిశుద్ధ్యం పలు రకాల పనులు నిర్వహించాలంటే తలకు మించిన భారమైంది. నిధుల కొరతతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

## నేను ఈ బడిలోనే చదివి.. డాక్టర్‌నయ్యా, ఎంఎల్‌ఏనయ్యా...

**- యూనిఫాం పంపిణీలో ఎంఎల్ఏ డా.తెల్లం**



ప్రజాపక్షం/ భద్రాచలం : నేను ఈబడిలోనే చదువుకున్నా.. ఆడుకున్నా.. పాడుకున్నా.. క్యూలైన్లో నిలబడి వందేమాతరం, జనగనమన తోటి విద్యార్థులతో కలిసి ఆలపించా... ఇప్పుడు డాక్టర్ అయ్యా... ఎంఎల్ఏ అయ్యా అంటూ స్థానిక శాసన సభ్యులు డా.తెల్లం వెంకట్రావు తన విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో పుస్తకాలతో పాటు యూనిఫాంలను స్థానిక నన్నపునేని(కొర్రాజులగుట్ట) స్కూల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుండే శ్రద్దతో చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని తెలిపారు. ఇదే విధంగా సామాజిక కార్యక్రమాల పట్ల శ్రద్ధ ఉండాలని, అందరితో కలిసి మెలిసి ముందుకు సాగాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. చదువుల ఎంతటి పేదవారినైనా ఉన్నతమైన వారిగా మారుస్తాయని, చదువొక్కటే తలరాతను మార్చగలదని చెప్పారు. అనంతరం పాఠశాలకు విచ్చేసిన పూర్వవిద్యార్థి డా.తెల్లం వెంకట్రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ అనుచరులతో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముందు నుండే విద్యకు గట్టి పునాది వేయాలి

**- ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు**

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన విద్యార్థుల విషయంలో ముందు నుండే చదువులపై గట్టి పునాది వేస్తే వారు ముందుకు సాగడానికి అవకాశం ఉంటుందని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం ఐటిడిఏ ప్రాంగణంలోని పిఎంఆర్‌సి భవనంలో ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చేరికలపై పిఓ ప్రతీక్ జైన్‌తో కలిసి డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల చదువులను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగం గా పిల్లలకు కావాల్సిన యూనిఫాంలు, నోటు, పాఠ్య పుస్తకాలు, క్రీడా వస్తువులు అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు చక్కగా చదివి పేరు ప్రతిష్టలుతేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిడి మణెమ్మ, ఏంఇఓ సమ్మయ్య, ఏటిడిఓ నర్సింహారావు, ప్రమీలభాయ్ పాల్గొన్నారు.

## కరకగూడెంకు ఆట స్థలం మంజూరయ్యేనా..?

**-గ్రౌండ్ లేక పక్క జిల్లాలకు, పక్క మండలాలకు వెళ్లే పరిస్థితి**
**-కరకగూడెం మండలానికి గ్రౌండ్ చాలా అవసరం**
**-స్టేడియాన్ని త్వరలో పనులు పూర్తిచేసి మండలానికి గిఫ్ట్‌గా ఇస్తానన్న ఎమ్మెల్యే పాయం**





ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలానికి కనీసం ఒక క్రీడా ప్రాంగణమైన అందుబాటులోకి తీసుకురావాలని నాటి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గ్రామ పంచాయితికి ఎకరం స్థలంలో క్రీడా ప్రాంగణం తయారు చేయాలని గత ప్రభుత్వం కిందట చెప్పిన సంగతి విధితమే. గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు లభించలేదని క్షేత్ర స్థాయి విజ్ఞప్తులు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మండలంలోని కనీసం క్రీడా స్థలాల నైనా సిద్ధం చేయాలని నిబంధనలు సవరించింది. అయితే మండల పరిధిలో ఆట స్థలం లేక పక్క జిల్లా, పక్క మండలాలకు వెళ్లి ఆటలు ఆడే పరిస్థితి నెల కొంది. ఉమ్మడి పినపాక మండలంలో యువత క్రీడాకారులకు అందుబాటులో ఉంటుందని మినీ స్టేడియం ప్రారంభించారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకుని క్రీడాల్లో రాణించాలనే సంకల్పంతో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేసిన తర్వాత వచ్చిన పాలకులు పట్టించు కోలేదు. విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పరీక్షించేందుకు కరకగూడెంలో ఒక గ్రౌండ్ కావాలని యువ క్రీడాకారులు కోరుతున్నారు. యువత కోరిక మేరకు మండలంలో గ్రౌండ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్టేడియం ఏర్పాటు చేస్తామని దాదాపు 2.10 కోట్ల నిధులు శంకుస్థాపన చేసిన విషయం అందిరికీ తెలిసినప్పటికీ మినీ నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు దృష్టి పెట్టి మినీ స్టేడియాన్ని త్వరగా పూర్తి చేసి యువ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావా లని ప్రజలు కోరుతున్నారు. ఏమైనా గేమ్స్ ఆడా లంటే పక్క జిల్లా ములుగు, పినపాక మండలం వెళ్లి ఆడే పరిస్థితుల నుండి కరకగూడెం మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే పాయం చేయాలని కోరుతున్నారు.

**క్రీడా మైదానం ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే పాయం**



కరకగూడెం మండలంల బట్టుపల్లి గ్రామంలో మినీ స్టేడియం త్వరలో ప్రారంభం అవుతుందని పినపాక శాసన సభ్యులు, పాయం వెంకటేశ్వర్లు ప్రజాపక్షం తో తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యువ క్రీడలపట్ల మక్కువ పెంచుకోవాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతి గ్రామంలో ఆట స్థలం ఏర్పాటు చేయాలని నిర్ణయం దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే కరకగూడెం మండలంలోని 16 గ్రామ పంచాయతీలు ఉండగా మండలం మొత్తం మీద మిని స్టేడియం ఏర్పాటు చేయాలని మండలం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

**క్రీడల్లో రాణించాలంటే మైదానాలే కీలకం : మాటూరి సాగర్**

ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలంటే క్రీడా మైదానాలు ఎంతో అవసరమని క్రీడాకారుడు మాటూరి సాగర్ తెలిపారు. ప్రభుత్వం క్రీడాలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని, ఈ మండలానికి స్టేడియం చాలా అవసరం క్రీడా మైదానం ఏర్పాటు చేయలని త్వరగా స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభిస్తే క్రీడాలతో పాటు కానిస్టేబుల్, ఎస్ఐ ప్రాక్టీస్‌కు వీలు ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

**మైదానం స్థలం కొంత ఆక్రమించారు : క్రీడాకారుడు, కౌశిక్**

అధికారుల నిర్లక్ష్యంతో ఉన్న ఒక క్రీడా మైదానం అభివృద్ధి పేరిట జరుగుతున్న నిర్మాణాలతో రోజు రోజుకు కుసించుకు పోతుందని క్రీడాకారుడు కౌశిక్ అన్నారు. మైదానంకు సంబంధించిన కొంత స్థలం ఆక్రమించి షెడ్లు వేసుకున్నారని, దీంతో రన్నింగ్ ట్రాక్, క్రికెట్, పూల్ బాల్ ఆటలకు పనికిరాకుండా పోయిందన్నారు. ప్రభుత్వం నిర్ణయంతో యువ క్రీడాకారులతో ఉత్తేజం నిండిందని, త్వరగా పనులు పూర్తి చేసి ఆట స్థలాన్ని అందించాలని తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి





ప్రజాపక్షం/బూర్గంపాడు: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కే చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో గల ఎంపియూపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన యూనిఫామ్ బుక్స్‌ను స్థానిక ప్రధానోపాధ్యాయులు తేజావత్ మోహన్ అధ్యక్షతన ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌళిక వసతులు ఉన్నాయని, దీని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపిచకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విజ్ఞానులైన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, మధ్యాహ్న భోజనం సైతం పాఠశాలలోనే విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. మొత్తం 44 మంది విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందించారు. అదే విధంగా మోరంపల్లిబంజర్, బూర్గంపాడు గ్రామ పంచాయితీలో గల పాఠశాలల నందు విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యాపుస్తకాలు, యూనిఫామ్‌లను అందించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో జములా రెడ్డి, సోంపల్లి గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్ శంకర్, ఎంపివో సునీల్ శర్మ, పంచాయితీ కార్యదర్శులు భూక్య వెంకటేశ్వర్లు, భవాని, సమ్మయ్య, గ్రామ పెద్దలు గాదె నర్సిరెడ్డి, పండగ రాములు, బాగి వెంకట్రావు, నస్కారి లక్ష్మి నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్ పర్సన్ తోకల అనిత, ఉపాధ్యాయులు సైదులు, రవి, తిరుపతమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాకురాలు బర్ల అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

## బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఏ జారే



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బడి బాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్‌లను అందించారు. అదే విధంగా పలువురు విద్యార్థులు చదువులలో మెరుగైన ప్రతిభ కనబర్చటంతో వారిని సన్మానించి మరింత మంచిగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం నిరక్షరాస్యతను రూపు మాపటానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య కోసం మెరుగైన ప్రమాణాలను తీసుకొస్తుందని, బాల కార్మికులు లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి చదువుకోవాలని, చదువు ద్వారానే ఉన్నతమైన స్థానాలను చేరుకోగలుగుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి



ప్రజాపక్షం/కరకగూడెం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాగి జావా, టిఫిన్ వండినందుకు వేతనం పెంచి ఇవ్వాలని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు నాయకులు కొమరం కాంతారావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం జనరల్ బాడీ సమావేశం తాటి లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను తక్షణమే పెంచాలని, మెస్ చార్జీలు పెంచాలని, గత సంవత్సరం వేతనాలు బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహాశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సంధ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు గొగ్గలి భద్రకాళి, కార్యదర్శి రమాదేవి, ఉపాధ్యక్షురాలు తాటి లక్ష్మి , ఆవుదొడ్డి మంగమ్మ, ఇర్పా సారక్క, ఢిల్లీ లక్ష్మి బాయి, కొమరం మల్లక్క, వజ్జ మంగమ్మ, పార్వతి రమణ, ఈశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు సభాధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఎంపిపి కొండ్రు మంజుభార్గవి చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, ఎంపిడివో రమాదేవి, ఎంపివో బత్తిన శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యులు రేవంత్, ఏపీఎం రామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత



ప్రజాపక్షం/చంద్రుగొండ: ప్రభుత్వం ఉచితంగా అందించిన యూనిఫామ్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. బుధవారం మండల పరిధిలోని మద్దుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన యూనిఫామ్ బుక్స్‌ను స్థానిక ప్రధానోపాధ్యాయులు భవాని అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌళిక వసతులు ఉన్నాయని దీని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపిచకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. పాఠశాలలో ఇప్పటి వరకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు 54 మంది విద్యార్థులు ఉన్నారని, మరో 34 మంది విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ వెంకట్‌నారాయణ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పిఈటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఏ కూటమి సంబురాలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఎన్డీఏ కూటమి టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో టిడిపి దిమ్మె వద్ద జెండా ఎగరేసి స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా పేల్చారు. ఈసందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు వారాధి సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నియంత పాలనకు విముక్తి చెంది సుపరిపాలన ప్రజలు పట్టం కట్టారని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి కావడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ లాగా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పోదుమూరి సత్యనారాయణ, చాపలమడుగు వెంకటేశ్వర్లు, శేఖర్, సోమయ్య, కిరణ్, బిజెపి మండల అధ్యక్షులు బోగి కృష్ణ, మోహన్‌నాయక్, రఘుపతి, జనసేన నాయకులు మాన్సింగ్, అభిషేక్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో పురోభివృద్ధి లేకపోతే చర్యలు

- నాణ్యత లోపించినా ఊరుకునేది లేదు
- ఖమ్మం రూరల్ పర్యటనలో మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఇప్పటికే నాలుగు నెలల ఆలస్యం అయ్యింది..ఆర్సీవాల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి..ఇందు కోసం ప్రతిభావంతులైన వర్కర్లను నియమించి పనుల్లో లోపాలు తలెత్తకుండా చూడండి.. పదిరోజుల్లో మళ్లీ వస్తా..పనుల్లో పురోభివృద్ధి లేకపోతే చర్యలు తప్పవని రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో విస్తృత స్థాయిలో పర్యటించారు. అందులో భాగంగా పొద్దుద్దునే దానవాయిగూడెంలో మున్నేరు ఆర్సీవాల్స్ నిర్మాణ పనులను మంత్రి,ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓ గణేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడారు...యుద్ధప్రాతిపదికిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఫుల్‌టైం నిర్మాణ పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. రెవిన్యూ అధికారులు మున్నేరుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇరిగేషన్ అధికారులకు అప్పగించాలన్నారు. గోళ్లపాడు సైడ్ డ్రైన్ల మాదిరిగా మున్నేరు సైడ్‌డ్రైన్‌లను నిర్మించాలన్నారు. స్టారింగ్ పాయింట్ ఎండింగ్ పాయింట్‌లను గుర్తించి సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టాలని తద్వారా మురికి నీరు మున్నేరులో చేరకుండా ఉంటుందని తెలిపారు. అక్కడి నుంచి రామన్నపేట చేరుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేసి మాట్లాడారు...గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యపట్ల మాటలకే పరిమితం అయ్యిందే తప్ప చేతల్లో అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు అద్దె భవనాల్లో నడిపించి పూర్తి వ్యవస్థను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. దాని ప్రతిఫలంగానే విద్యార్థులు ప్రయివేటు పాఠశాల బాట పట్టారన్నారు. దీంతో తల్లిందండ్రులు ఆశయం తాపత్రయంగానే మిగిలిపోయిందన్నారు. పేదవారికి అండగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అని, తప్పకుండా రాజకీయాలకు అతీతంగా సంక్షేమాన్ని అందిస్తామన్నారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లు మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూలులాంటి ఎస్టాబ్లిష్ చేస్తామన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు నోరుజారే ముందు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. అనంతరం రఘునాధపాలెం మండలంలోని వి.వెంకటయాపాలెం, ఖమ్మం రూరల్‌లోని దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, పాటివారి గూడెం, జాన్‌బాద్‌తండా1, జాన్‌బాద్‌తండా2, పడమట్టితండా, దారేడు గ్రామాల్లో పర్యటించి అక్కడ ఏర్పాటు చేసి సభల్లో మాట్లాడారు..ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోజెడ్ల సూర్యం, పిట్ల కృష్ణమూర్తి, వేములపల్లి రాధకృష్ణ, బత్తిని సీతరాములు, సోమ్లు, మాలోత్ రాజు, రాంరెడ్డి, రాఖీ, దేవరపల్లి వెంకటకృష్ణ, జంగాల ఉపేందర్, బోడ వీరన్న, కలింగ మోహన్‌రావు, బొప్పి గాంధీ, బత్తిని సీతరాములు, సర్పంచ్‌లు తూరుగంటి సంగయ్య, శంకర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర టిపిసిసి ప్రచార్ కమిటి మెంబర్ ధరావత్ రామ్మూర్తినాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, పాలేరునియోజకవర్గ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్యా సురేష్ నాయక్, నాయకులు ప్రతాపనేని రఘు, బట్టుపోతుల సతీష్, వెంపటి రవి, వెంపటి వెంకన్న, కొక్కు రాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ఒక మంచి అవకాశం




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ప్రస్తుతం కమ్యూనికేషన్స్,కంప్యూటర్ రంగాలలో చాల మార్పులు వచ్చాయని, వాటిలో మంచి నైపుణ్యాన్ని సాధించడం కోసం విద్యార్థినిలకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రియదర్శిని మహిళకళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు సూచించారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్ద తండాపంచాయతీపరిధిలో గల ప్రియదర్శిని మహిళసాంకేతిక కళాశాలలో ఆర్‌డిఐఓ సౌజన్యంతో రెండురోజుల కంప్యూటింగ్, కమ్యూనికేష్ మల్టీడిసిప్లినరీ ఆవిష్కరణలపై జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మోషీన్ లెర్నింగ్‌లు వివిధ బహుళజాతి సంస్థలు, ఎడ్యుకేషన్, సర్వీసెస్, మాన్యుఫాక్చరింగ్, హాస్పిటల్‌లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వీటిలోని సాంకేతికతను పునికిపుచ్చుకోవడానికి అనుభవజ్ఞులైన వారి సలహా,సూచనల ద్వారా అవగాహణ కలుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్ మాట్లాడుతూ...విద్యార్థులు ఈలాంటి సమావేశాలలో పాల్గొనడం ద్వారా సమాజ భావనను నిర్మించడం, బలోపేతం చేయడం వ్యక్తులతో సంబంధాలను ఏర్పరుచుకోవడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుండి వచ్చిన 50ప్రాజెక్టులు ఎంపిక చేయగా..వాటిని ప్రాజెక్టుల కాన్ఫరెన్స్‌లో పేపర్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఐఒ డైరెక్టర్ కార్తీక్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నన్ను విధుల్లోకి తీసుకోండి

- నాపై ఆరోపణలు తగవు..
అవుట్‌సోర్సింగ్ మహిళ ఉద్యోగి ఆవేదన
- మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పాలేరు ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్‌లో ల్యాబ్ అటెండెంట్‌గా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న తనను, హాస్టల్‌లో జరిగే విషయాలను అక్కడే పని చేస్తున్న స్టాఫ్‌నర్స్ భరక్తకు తెలియజేస్తున్నాని అనుమానంతో తనను కాలేజ్ ప్రిన్సిపాల్ రత్నకుమారి విధుల్లోకి తీసుకోకుఎండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఉద్యోగి చైతన్య అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాలోని కాలేజ్ ఎదుట కూర్చొని నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..హాస్టల్ విషయాలను స్టాఫ్ నర్స్ భర్తకు తెలియజేస్తునని, తనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌ల్ స్టాఫ్‌నర్స్, ప్రిన్సిపాల్ రత్నకుమారి సూచన మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తనను స్టేషన్‌కు పిలిచి, ఫోనలోని కాల్‌డేటాను పరిశీలించి వారి చేసిన ఆరోపణలు అవాస్తవమని తేల్చి చెప్పినట్లు చైతన్య అన్నారు. ఆరోపణలు అవాస్తవమని నిర్మారణ జరిగినప్పటికీ, ప్రిన్సిపాల్ రత్నకుమారి తనను ఉద్యోగ విధుల్లోకి తీసుకోకుండా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరువుకు భంగం కలిగించిన స్టాఫ్ నర్స్, ప్రిన్సిపాల్ రత్మకుమారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తన ఉద్యోగాన్ని తాను చేసుకునేలా ఉన్నతాధికారులు అవకాశం కల్పించాలని కన్నీరుమున్నీరుగా విలపించింది.దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌కు వినత పత్రం అందజేసినట్లు పేర్కొంది.

## రామాలయం హుండీ రూ.1.68 కోట్లు



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామివారి హుండీ ఆదాయం రూ.1కోటి68లక్షల 54వేల 129 సమకూరింది. బుధవారం హుండీలు తెరిచిన ఆలయాధికారులు లెక్కింపు చేపట్టారు. ఆఖరి సారిగా మే 2వ తేదిన హుండీ లెక్కించిన అనంతరం 45 రోజుల తర్వాత లెక్కింపు చేపట్టారు. నగదుతో పాటు 117 గ్రాముల బంగారం, 1300 గ్రాముల వెంటి కూడా భక్తులు రామునికి సమర్పించుకున్నారు. వేసవి సెలవుల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఇరు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుండి రాముని దర్శనార్థం భద్రాచలం చేరుకున్నారు. కోరిన కోర్కెలు తీరడంతో పెద్ద ఎత్తున స్వామివారికి ముడుపులు చెల్లించడంతో పాటు ఇష్టదైవానికి కానుకలు సమర్పించారు.

## మైనార్టీ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేటలోని ముస్లిం మైనార్టీ బాలికల పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సందర్శించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ముందుగా ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్ళపాడులో హెల్త్ క్యాంపు




**ప్రజాపక్షం/ బోనకల్ :** జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆళ్ళపాడు, రావినూతల గ్రామాల్లో బుధవారం ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు అవుతున్న కారణంగా హెల్త్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు, ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉందని, నీటిని కాచి చల్లార్చి తాగాలని, ఎప్పటికప్పుడు ఆహారం సిద్దం చేసుకుని తినాలని సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యుస్ ఎఇ ఆధ్వర్యంలో ఆళ్ళపాడు, రావినూతనల, బోనకల్, గోవిందాపురం(ఎల్) నందు 18 వాటర్ శాంపిల్స్ సేకరించి టెస్టింగ్‌కు పంపించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ పి.శ్రీనివాసరావు, పిడిఎంఓ డాక్టర్ సాయి ప్రియాంక, ఎం.దీనీష్, పంచాయతీ కార్యదర్ధి పరుశురాం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ బోనకల్ :** సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వైస్ ఎంపిపి గుగులోతు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా బోనకల్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోపిచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలిన తెలుగు తమ్ముళ్లు



**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరుసగా నాల్గొవసారి ముఖ్యమంత్రిగా గెలిచి గన్నవరం ఐటి పార్క్ వద్ద బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా బోనకల్ మండల వ్యాప్తంగా ఉన్న తెలుగు తమ్ముళ్లు ప్రమాణ స్వీకారానికి కదలివెళ్లారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, నాయకులు తూము పురుషోత్తం, మామిళ్ళ నర్సింహారావు, గొల్లపల్లి నాగేశ్వరరావు, ఇసంపల్లి వెంకన్న, మల్లాది లింగయ్య, బంధం రంగయ్య, బంధం హుస్సేన్, బొడ్డుపల్లి రామారావు, చావా శేషగిరిరావు, షేక్. ఖాసీంసాహెబ్, మంద నరేందర్, వట్టికుంట నవీన్, జగదీష్, కన్నెపోగు రవీంద్ర, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు సజ్జనపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# గుట్ట ఆక్రమణలో..
# నివేదికల పేరుతో కాలయాపన..!

**-ఆర్ఐ, సర్వేయర్ నివేదికలు ఇచ్చినా ఆలస్యం ఎందుకు..?**
**-రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారితో లాలూచి ఒప్పందమా..?**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 98 సర్వే నెంబర్‌లోలో ఉన్న ప్రభుత్వ గుట్ట అక్రమ రిజిస్ట్రేషన్‌పై వైరా తహాశీల్దార్ నివేదికల పేరుతో ఎందుకు అలసత్వం చేస్తున్నారు? 98 సర్వే నెంబర్‌లో 275.55 గజాలు ఉన్న ఇంటి స్థలం 709.55 గజాలుగా అప్పనటి సబ్ రిజిస్టర్ కృష్ణయ్య, అప్పటి మున్సిపాల్ కమీషనర్, నరేందర్‌రెడ్డి అనే వ్యక్తితో కలిసి గుట్ట రిజిస్ట్రేషన్‌లో కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు కూడా ఉన్నాయి. కాని ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ఆర్ఐ మెచ్చా వెంకటేశ్వరరావు గుట్ట ఆక్రమణ ప్రాంతం వద్దకు వెళ్లి పరిశీలించి తర్వాత పత్రాలు పరిశీలించి గుట్ట భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న మాట వాస్తవమేనని నివేదిక ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మండల సర్వేలు కూడా గుట్ట ప్రక్కన ఉన్న ఇళ్ళు ప్రాంతం సర్వే నిర్వహించి గుట్ట ఆక్రమణ జరిగింది. గుట్టకు ఆనుకొని ఉన్న ఇంటి నిర్వాహకులు గుట్ట రిజిస్ట్రేషన్‌ను ఎలాంటి ధృవపత్రాలు 275.55 గజాలు స్థలం 709.55 గజాలుగా లేకుండా చేయడం జరిగిందని నిర్ధారించి ఆమె కూడా నివేదికను తహాశీల్దార్‌కు అందించింది. గత కొన్ని నెలలుగా గుట్ట ఆక్రమణపై చర్యలు తీసుకోవడంలో వైరా తహాశీల్దార్ ఎందుకు వెనుకాడబోతున్నారు. ఇటీవల కాలంలో గుట్టను అక్రమ రిజిస్ట్రేన్ చేయించుకున్న వ్యక్తులు వైరా తహాశీల్దార్ కార్యాలయంలో మాపై ఎలాంటి చర్యలు తీసుకోరని



చెప్పడం ఇప్పుడు సర్వత్ర విమర్శలకు తావిస్తుంది. ప్రభుత్వ భూములు పట్ల ఆక్రమణ జరిగిందని క్రిందస్థాయి అధికారులు నివేదిక పంపించామంటూ గత కొన్ని నెలలుగా ఇదే చెబుతున్నారు. ప్రభుత్వ గుట్ట రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిసాక ఆర్ఐ, సర్వేయర్ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా కాలయాపన చేయడం అంటే పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రతిసారి కలెక్టర్‌కి మెసేజ్ పెట్టాం, కలెక్టర్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదని నివేదికల పేరుతో కలెక్టర్ కార్యాలయం పేరుతో తహాశీల్దార్ కాలయాపన చేస్తున్నాడు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గుట్ట రిజిస్ట్రేషన్ అక్రమంగా జరిగిందని క్రిందస్థాయి అధికారులు నిర్ధారించిన తహాశీల్దార్ ఎందుకు ఆలస్యం చేస్తున్నాడని ఒక్కసారి చర్యలు చేపడితే వాస్తవాలు పూర్తిస్థాయిలో బయటకు వస్తాయి.

## బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

**ప్రజాపక్షం/దమ్మపేట:** గిరిజన విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వసతులు కూడిన నాణ్యమైన విద్యను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జారె ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్స్ స్కూల్ జెడ్పీఎస్ దమ్మపేట, పార్కిల్ గండి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనపరచుచున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం మన బడి ద్వారా చేపడుతున్న స్కూళ్ళ మరమ్మత్తులను పరిశీలించి ఆయన సంతోషం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జారె మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వసతులు కనిపించాలని, క్రీడలు పరంగా, విద్యాపరంగా ఆలసత్వం వహించకుండా నూటికి నూరు శాతం ఉత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులను, సిబ్బందిని సూచించారు. అనంతరం దమ్మపేట పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా



యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏటీవో చంద్రమోహన్, ఎంఈఓ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ధర్మ, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, చిన్నంశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, కొయ్యల అచ్యుతరావు, పాకనాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ధృవపత్రాల సత్వర జారీకి చర్యలు తీసుకోండి : సిపిఐ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్యా సంస్థలు ప్రారంభమైన సందర్భంగా ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ కుల ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాల సత్వర జారీకి చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ ఆన్‌లైన్ అంటూ రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని వీలైనంత త్వరగా ధృవపత్రాలు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా పత్రాల జారీ కోసం కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు.




ఆన్‌లైన్ పేరుతో అధికారులు చేతులు దులుపుకునే పరిస్థితి ఏర్పడిందని ఇది సరైన పద్ధతి కాదన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ నాయకులు నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు తదితరులు ఉన్నారు.

## బిసి కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలోని బిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా డబుల్ బెడ్ ఇండ్లకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉందని రోడ్డును మంజూరు చేయాలని కోరారు. బుధవారం ఈ ప్రాంతంలో పర్యటించిన మంత్రి పొంగులేటికి సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. తగు పరిశీలన చేసి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, తులిరాం, ఉపేంద్ర, కాటయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబుకు తుమ్మల శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆంధ్రప్రదేశ్ లో నూతనంగా ఏర్పడిన నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుని అభివృద్ధి పదంలో పయనించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

## గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో శ్రీకోట మైసమ్మ అమ్మవారి ప్రాంగణంలో యాదవ మహారాజుల ఆరాధ్య దేవత గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట బుధవారం ఉదయం 11 గంటలకు కోట మైసమ్మ అమ్మవారి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పరస పట్టాభిరామారావు చేతలు మీదుగా విగ్రహ ప్రతిష్ట చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యగారు కైలాస్‌శర్మ, ఉసిరికాయలపల్లి యాదవ సంఘం నాయకులు డాక్టర్ వరస పట్టాభిరామారావును యాదవ సంఘం నాయకులు అందరూ శాలువాతో సత్కరించారు.

## సింగరేణి మండంలో బడిబాట



**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమిక పాఠశాల కారేపల్లి నందు మండల పరిషత్ అధ్యక్షురాలు మాలోతు శకుంతల, జెడ్పిటిసి వాంకుడోతు జగన్, ఎంపిడివో సురేందర్ ప్రాథమిక పాఠశాల సందర్శించి విద్యార్థులతో , వారి తల్లి దండ్రులతో మాట్లాడారు. అదేవిధంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఇమ్మడి రమాదేవి, ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, సిఆర్‌పి తదితరులు పాల్గొన్నారు.

## ముత్తగూడెంలో దారుణం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం గ్రామంలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. ఓ మట్టిట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టడంతో గునిగంటి వీరేందర్(9)అనే చిన్నారి అక్కడిక్కడే మృతి చెందాడు.అక్కడి ఎన్ఎస్‌పీ బ్రిడ్జిపై నుంచి వెలుతున్న బాలుడిని వెనుకనుంచి ఢికొట్టి టైర్లతో తొక్కడంతో ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కన్నీటిపర్యాంతమాయ్యరు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/ఏన్కూరుః** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, దుస్తులను బుధవారం ఎండివో రమేష్, ఎస్సై బాదావత్ రవి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎండివో, ఎస్సై మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక తరగతి రూము, ఆటలాడుకునేందుకు విశాలమైన క్రీడా ప్రాంగణం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూరాకుల సైదయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు, రాధ, శ్రీధర్, చంద్రప్రకాష్, విజయలక్ష్మి, కస్తూరి, రాంబాబు, శంకర్‌రావు, సులోచన, భీమ్‌సింగ్, బివి.నర్సింహారావు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లచ్చిరాం, కృష్ణప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంబరాలు జరుపుకున్న టిడిపి శ్రేణులు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. మండల పరిధిలోని నాచారం గ్రామంలో మండల అధ్యక్షులు కొనకంచి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తొలుత దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ జెండాను ఎంపిపి ఆర్ఎం.వరలక్ష్మి ఎగరవేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం.రామయ్య, తోట రాధాకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ తోట గిరిజ, కోపెల రామారావు, నామ వెంకయ్య, ఏరువ నవీన్, గారపాటి అశోక్, చిన్న సుబ్బారావు, స్వర్ణ కోటేష్, కొప్పుల రామకృష్ణ, వల్లంపట్ల వేణు, గివిని మధు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమస్తం సాధ్యం

**కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బుధవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా పాల్వంచ మండలం ప్రశాంతినగర్ ఎంపిపిఎస్ పాఠశాల, లక్ష్మీ దేవిపల్లి మండలం కొత్తూరు ఎంపిపి పాఠశా, గొల్లగూడెం జిపిఎస్ పాఠశాల, చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ ఎంపిపిఎస్ పాఠశాలలో జరిగిన బాడిబాట కార్యక్రమంలో పాల్గొని పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్ధులకు ఆమె పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోనే దేనినైనా సాధించవచ్చని, విద్యార్థులంతా చిన్ననాటి నుండే శ్రద్ధగా చదువుకుని ఉన్నతశిఖరాలు అదిరోహించాలని చెప్పారు. మేమంతా ఈ రోజు ఉద్యోగాలు చేస్తున్నామంటే చక్కగా చదువుకోబట్టే అని, మేము బడికి వెళ్లి నేర్చుకున్నవారమే అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల కంటే ప్రభుత్వ బడులకే అధిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, తెలుగు మీడియంతో పాటు ఇంగ్లీష్ మీడయంలో కూడా చదువులు సాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ కంచెర్ల చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ కాపు సీతామహాలక్ష్మీ , డిఆర్‌డిఓ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డిఓ మధు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరచారి, మున్సిపల్ కమీషనర్ శేషాంజనస్వామి, తహశిల్దార్‌లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎంపిపిలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా




**ప్రజాపక్షం/కూసుమంచి :** మండల కేంద్రంలోని బుధవారం నాడు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా రైతాంగం ఎదుర్కొంటున్నటువంటి అనేక సమస్యల పరిష్కారం కై అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ కి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ కూసుమంచి మండల అధ్యక్షులు మాతంగి రామస్వామి అధ్యక్షతన జరిగిన సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకటరామిరెడ్డి అఖిల భారత రైతు కూలీ సంఘం కూసుమంచి మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్యలు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైన అందువలన రైతులకు కావాల్సినటువంటి విత్తనాలు ఎరువులు పురుగు మందులు సరిపడ నాణ్యమైన వాటిని ప్రభుత్వం సబ్సిడీపై సప్లై చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై పీడీ యాక్ట్ పెట్టాలని, వ్యవసాయ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, భూసార పరీక్షలు నిర్వహించి రైతులను చైతన్య పరచాలని అందుకు తగినట్లు గ్రామసభలు వివరించాలని వారు డిమాండ్ చేశారు. మండలంలో నకిలీ విత్తనాలతోనే పురుగుమందులతోనే అనేక మంది రైతులు దిగుబడి రాక నష్టపోతున్నారని దీనికి కారణం వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రైతులకు పంట రుణాలు మాఫీ చేసి వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ రైతులకు 50 సబ్సిడీతో విత్తనాలు ఎరువులు పురుగు మందులు వ్యవసాయ పరికరాలు అందించాలన్నారు. రైతాంగం పండించబోయే పంటలకు ముందుగానే స్వామినాథన్ సిఫారసుల అనుసరించి సీటు ప్లస్ ఫిఫ్టీ ప్రాతిపదికన ప్రభుత్వం ధరలు ప్రకటించాలని, పంటలకు క్రాపు ఇన్సూరెన్స్ కూడా వర్తింపజేయాలని అన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్నటువంటి పట్టాదారు పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలన్నారు బీటీ త్రీ పత్తి విత్తనాలను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల డివిజన్ నాయకులు బుర్ర సైదులు, పోటు లక్ష్మయ్య, బత్తుల ఉప్పయ్య, నిమ్మల వెంకన్న, బత్తుల నాగయ్య, బత్తుల రాంబాబు, మొక్క వీర, నాగులు, భూక్య లక్ష్మ, బానోతు రమేష్, భూక్యా పంతులు, బుక్య సక్కు బాదావత్ దేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు పరిష్కారం ప్రజా ఉద్యమాలే..




**ప్రజాపక్షం/వైరా:** ప్రజా సమస్యల పరిష్కారానికి రాబోయే కాలంలో ప్రతి సభ్యుడు ఒక సైనికుడిలా పనిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సిపిఎ పార్టీ వైరా పట్టణ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మధు విద్యాలయంలో రెండో రోజు జరిగాయి. ఈ రాజకీయ తరగతులకు పార్టీ వైరా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. బుధవారం పార్టీ నిర్మాణం క్లాసును, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బోధిస్తూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలను కూడగట్టి ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయాలని అన్నారు. అధికారమే లక్ష్యంగా ప్రజలను అనేక భ్రమలు కల్పించి ప్రలోభాలకు లోను చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి సభ్యుడు ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం ప్రజల్లో ఉండి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, రూరల్ కార్యదర్శి తోట నాగేశ్వరరావు, పట్టణ నాయకులు బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వెంకటేశ్వరరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పొంచిఉన్న ప్రమాదం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరుకొండి విద్యుత్ కేంద్రం పరిధిలో పోచవరం డబల్ బెడ్ రూమ్ కాలనీలో విద్యుత్ స్తంభంకు తీగలు అలముకొని, తీగలపై ఉండటంతో తరచూ మంటలు, కరెంటు పోవడం లాంటివి జరుగుతున్నాయని, పొంచి ఉన్న ప్రమాదాన్ని తొలగించాలని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వాటి వలన వర్షం టైం లో ఫీజులు పోవడం, మంటలు వచ్చే అవకాశం ఉందని, డబల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలో అలముకొని ఉన్న నిర్లక్ష్యాన్ని విద్యుత్ శాఖ అధికారులు తొలగించే ఏర్పాట్లు చేయాలని డబల్ బెడ్ రూమ్ గృహ సముదాయం కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

# రామసహాయం పద్మమ్మకు ఘన నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రామసహాయం వెంకట్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల కాలంలో మృతి చెందగా బుధవారం దశదినకర్మ సందర్భంగా రామ సహాయం పద్మమ్మకు మంత్రులు ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గృహ నిర్మాణ రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి. వ్యవసాయ .సహకార. జౌళి .మంత్రిత్వ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామ సహాయము రఘురాం రెడ్డి . రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు లు ఘన నివాళులర్పించారు. వీటితోపాటు మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమెకు నివాళులర్పించి వెంకటరెడ్డి కుటుంబానికి వారి సానుభూతిని ప్రకటించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ద్విచక్ర వాహనం, ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకా నగర్‌లో నివసించే మేడా నాగార్జున్ (35) ఖమ్మం కార్పోరేషన్‌లో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం నాగార్జున్ ద్విచక్ర వాహనంపై ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వైపు వెళ్తుండగా ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ సమీపంలో వెనక నుంచి ఇసుక టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగార్జున్ రోడ్డుపై పడిపోయాడు. అతని తలపై నుంచి లారీ వెనక టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నం ఫౌండేషన్ నిర్వహకులు అన్నం శ్రీనివాసరావు బృందం సహకారంతో నాగార్జున్ మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఆయనకు భార్య ఉన్నారు. తండ్రి తిరుమలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

# బంగారు భవిష్యత్తుకు విద్య అవసరం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్య ఎంతో అవసరమని ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్ధానిక జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్బా పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ప్రభు త్వం అందించే పాఠ్యపుస్తకాలు, దుస్తువులను విద్యార్ధులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంఎల్ఏ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పాఠశాలలలో మౌళిక వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలకు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు ఉన్నాయని దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో విద్యార్ధుల తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణజ, ఎంపిడివో అశోక్, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత దేవి, సోని, స్వాతి, పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, తుమ్మలపల్లి సురేష్, శివప్రసాద్, కేసుబోయిన నరసింహారావు, ఇస్లావత్ రుక్మిణి, పజిల్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాని ఎగరవేయని కార్యదర్శిపై చర్యలేవీ..?




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఉమ్మడి రాష్ట్రంలో తీవర ఇబ్బందులు ఎదుర్కొని నీళ్ల నిధులు నియామకాలు నినాదంతో ఉద్యమం లాగా పోరాడి ఎంతోమంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న విధులకు డుమ్మా కొట్టి జాతీయ జెండాను ఆవిష్కరించకుండా జాతీయ జెండాను అవమానించిన బచ్చోడు తండా పంచాయతీ కార్యదర్శి ప్రసన్న కుమార్ ను కాపాడేందుకు మండల అధికారులు ప్రయత్నిస్తున్నారు. సుమారు పది రోజులు అవుతున్న ఇంతవరకు అతనిపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయం గ్రామపంచాయతీలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకుండా విధులకు వస్తూ ప్రజల్ని తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు. గ్రామాల అభివృద్ధి మరిచి ప్రభుత్వం ఇచ్చే వేతనాన్ని తీసుకుంటూ బలాదూర్ తిరుగుతున్నారు. వర్షాలు పడితే గ్రామాల్లో అడుగు పెట్టాలంటే నరకయాతన పడాల్సిందే ముందుగానే సైడ్ కాల్వలు గ్రామాలకు వచ్చే మిషన్ భగీరథ గేటు వాళ్ల మంచి నీటి ట్యాంకులు శుభ్రపరచుట నర్సరీలో మొక్కలను సంరక్షణ చర్యలు చేపట్టడం మొదలగు సమస్యలు ఎన్నో ఉన్నాయి కానీ ఈ పట్టించుకోకుండా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు చర్యలతో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ లక్ష్యాని నీరు కారుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధులకు సకాలంలో హాజరుకాని కార్యదర్శిల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.